సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. నలుగురికి రూ.2 .25 లక్షల విలువ గల చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముకన్న, వెంకన్న, కిరణ్‌ప్రసాద్, విఘ్నేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ తల్లికి పూజలు



పూజలో సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు ఆదివారం చిత్తారమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యులకు స్వాగతం పలికి సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాధవరం శ్రీనివాస్‌రావు, మేకల సుదర్శన్, తీగల కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, రాజు యాదవ్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బాలరాజ్, రాము, కృష్ణవేణి, విద్యాకల్పన, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

నిజాంపేట్: పేద ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధి కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్‌లో బాచుపల్లి మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులు బతికే పరిస్థితి నేడు లేదన్నారు. ఈ నెల 20న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెను పాకిస్తాన్‌తో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శిగా పాలబిందెల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ర్యక్రమంలో యాదయ్య, శ్యామ్, బాలకృష్ణ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతంతే చెత్త సేకరణ..!

తడి, పొడి సేకరణలో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం

- శివారుల్లో ఒక్కొక్క పురపాలికలో 40 నుంచి 65 టన్నుల చెత్త
- వాహనాలు సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత
- ఇబ్బందుల్లో పుర ప్రజలు.. పట్టించుకోని కమిషనర్లు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, తూంకుంట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు ఉన్నాయి. శివారుల్లో మొత్తంగా 29 పురపాలక సంఘాలు ఉండగా, లక్షకు పైగా జనాభా గల పురపాలికల్లో ప్రతీ రోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. సంబంధిత అధికారులు చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవడం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక..

చెత్తను తరలించే వాహనాలు వార్డులు /డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పలుచోట్ల చెత్తను రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయించినా..సేకరణలో అలసత్వం వహిస్తున్నారు. పోచారం పురపాలక సంఘం పరిధిలో సర్వీస్ రోడ్డు ప్రాంతాలతో సహా ఖాళీ ప్లాట్లు, స్థలాలతో సహా హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి సమీప ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను వేస్తున్నారు. ఇదే పరిస్థితి శివారుల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూడా దాపురించడంతో ప్రజలు అనారోగ్యాలకు గురికావల్సి వస్తోంది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించడం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దృష్టికి రాలేదంటున్న కమిషనర్లు

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు పేర్కొంటున్నారు. ఒకవేళ చెత్త సేకరణలో జాప్యం ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే డివిజన్లు/ వార్డుల వారీగా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించి.. తడి,పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

పనిచేస్తున్న ఇంటికే కన్నం..

- బంగారు ఆభరణాలు దొంగిలించిన మహిళ అరెస్ట్
- 90 గ్రాముల బంగారం, 77 గ్రాముల వెండి స్వాధీనం

మియాపూర్: ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించిన పనిమనిషిని మియాపూర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం చండకాంపల్లికి చెందిన భయమ్మ అలియాస్ లక్ష్మీ(40) మియాపూర్ ఆల్విన్ కాలనీలో నివాసముంటుంది. మియాపూర్ మదీనాగూడ మైత్రినగర్ కాలనీ ఫేస్–2లోని కృష్ణకార్తీక్ ఇంట్లో గత పది సంవత్సరాలుగా పనిచేస్తుంది. అదేవిధంగా చుట్టుప్రక్కల ఇళ్లల్లో కూడా పనులు చేస్తోంది. రోజు మాదిరిగానే పనికి వచ్చిన లక్ష్మీ కృష్ణకాంత్ లేని సమయం చూసి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి అందులో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లింది. నారాయణఖేడ్‌లోని ఓ జువెలరీ షాప్‌లో విక్రయించేందుకు వెళ్లగా షాపు యజమాని అనుమానంతో అక్కడ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకుని లక్ష్మీని విచారించి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. కాగా కృష్ణకాంత్‌కు మియాపూర్ పోలీసులు సమాచారం అందించడంతో కృష్ణకాంత్ ఇంట్లో బీరువాను తెరిచి చూడగా నగలు కనిపించలేదు. వెంటనే మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పనిమనిషి లక్ష్మీని విచారించగా దొంగతనం చేసినట్టు ఒప్పుకుంది. ఆమె వద్దనుండి 90 గ్రాముల బంగారు నగలు, 77 గ్రాముల వెండి ఆభరణాలను మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీపై కేసు నమోదు చేసుకుని అరెస్ట్ చేశారు. గతంలో కూడా ఆమె పనిచేసే ఇళ్లల్లో చిన్న చిన్న వస్తువులు దొంగతనానికి పాల్పడుతూ పట్టుబడగా యజమానులు మందలించే వారని పోలీసులు తెలిపారు.



కేపీహెచ్‌బీకాలనీలోని లులు మాల్‌లో వివిధ కంపెనీల దుస్తులు ధరించి ర్యాంపు వాక్ నిర్వహించారు. నటి శాన్వి మేఘన ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో నటుడు హర్షిత్‌రెడ్డి, బిగ్‌బాస్ ఫేం రోహిత్, మెరీనా, ఊర్మిళ చౌహాన్, రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ పాల్గొన్నారు. – మూసాపేట



కూకట్‌పల్లిలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధాలయం శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానానికి కూకట్‌పల్లికి చెందిన పోలోజి పవన్‌కుమార్, స్వరూప దంపతులు 80 వేల రూపాయల స్టీరియో, స్పీకర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీద ఆలయానికి అందజేశారు. – కూకట్‌పల్లి



పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయం నుంచి తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు – ఆల్విన్‌కాలనీ

రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం

ఎంపీ ఈటల రాజేందర్



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీదే అధికారమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం, ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది ప్రజల కోసం పోరాడే పార్టీ అని, ప్రధానమంత్రి నాయకత్వంలో భారతదేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కార్యాలయం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని స్థానిక నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్. మల్లారెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: రీచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 కమిటీ హాల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమ్మారెడ్డి, డా. రామకృష్ణా రెడ్డి, డా. సృజనారెడ్డి, డా. అమిత్, బి వెంకటేష్ గౌడ్, పోశెట్టి గౌడ్, సురభి రమేష్ రావు, విష్ణువర్ధన్ రెడ్డి, గోవర్ధన్, శ్రీశైలం, రఘు పాల్గొన్నారు.

మాతృదేవోభవ..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మాతృదేవోభవ నృత్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. నృత్యకిన్నెర సంస్థ ద్వారా వాసవి చౌదరి సీతాదేవిగా, వకుళమాతగా లవకుశలుగా బేబి హితైశి, బేబి నిత్యలు నటించారు. మద్దాలి ఉష గాయత్రి శిష్యబృందం మాతృదేవోభవ కూచిపూడి నృత్యప్రదర్శనలో కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగంలో మాతృమూర్తులు పార్వతీదేవి, లీలావతి, సీతాదేవి, యశోదమాత, వకుళాదేవిల మాతృప్రేమని కన్నులకు కట్టినట్టు చూపారు.



దరఖాస్తుకు నేడు ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో ప్రవేశ పరీక్ష ఆధారిత డిప్లొమో, పోస్టుగాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను సమర్పించడానికి సోమవారం చివరి తేదీ. ప్రవేశ పరీక్షలను జూన్ 12,13,14 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్, ఎంఎడ్, మాస్టర్ ఆఫ్ లా, బీటెక్ (కంప్యూటర్‌సైన్స్) ఎల్‌ఎల్‌బి, బీఎడ్, డీఎల్‌ఎడ్, పాలిటెక్నిక్ డిప్లొమోలలో ప్రవేశాలు అందిస్తారు. వివిధ పీహెచ్‌డీ కోర్సులకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసి దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మరిన్ని వివరాలకు 040–23006612 ఎక్స్‌టెన్షన్ 1801ను సంప్రదించాలి.

వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు హుళక్కేనా..?



రాయదుర్గంలో గచ్చిబౌలి వార్డు కమిటీ కార్యాలయం (ఫైల్)

రాయదుర్గం: వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు కలగానే మిగిలింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా వార్డు, ఏరియా కమిటీలను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఎక్కువ మందికి అవకాశాలు కల్పించి వీటిని మరింత పటిష్టం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అందరిలో ఆశలు రేకెత్తాయి. డివిజన్ స్థాయిలో అధికార యంత్రాంగాన్ని నియమించి గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ జీహెచ్‌ఎంసీ పాలక మండలి ఏర్పడి నాలుగేళ్ళు పై బడినా కమిటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో డివిజన్‌లోని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తమకు పదవులు ఉండవా....? అని మదనపడుతున్నారు. ఇప్పటికైనా వార్డు, ఏరియా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- గతంలో గచ్చిబౌలి డివిజన్‌లో వార్డు, ఏరియా కమిటీలలో 11 మంది వార్డు, 9 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉండేవారు.
- నెలకోమారు నిర్వహించాల్సిన సమావేశాలు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మూడు నెలలకోమారు, ఆ తర్వాత ఏడాదిలో మొక్కుబడిగా నిర్వహించి వదిలేశారు.
- నాలుగేళ్ళుగా ఈ వార్డు కమిటీలు లేకపోవడంతో ఇక సమావేశాలే లేకుండా పోయాయి.
- గత పాలకమండలి పదవీకాలం ముగియడంతో వీరి పదవీ కాలం కూడా ముగిసినట్లయింది.ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో అగమ్యగోచరంగా తయారైంది.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయదర్శిని ఎన్‌క్లేవ్‌లో తానునీటి సరఫరా పైపులైన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, నూతనంగా వెలుస్తున్న కాలనీలలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీలో మిగిలిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

- నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి మధురానగర్‌లో నిర్వహించిన డాక్టర్ యాసీనా భాను అభినందన సభ జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై 2025 నీట్ ఎస్.ఎస్ పరీక్షలో జాతీయస్థాయిలో 11వ ర్యాంకు సాధించిన డాక్టర్ యాసీనా భానును సన్మానించారు. వైద్య వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీ బాలాజీ వెస్ట్ కౌంటీలో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ ప్రజలు ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు, నాయకులు సాంబశివ రావు, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతే ముఖ్యం..

చదువుకున్న వారే సైబర్ బారిన పడుతున్నారు



- హాస్టళ్లలో దొంగతనాలు ఎక్కువ
- ప్రధాన కూడళ్లలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు



మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌నాయక్

మాదాపూర్: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారని మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.విజయ్‌నాయక్ తెలిపారు. సోషల్ మీడియా, ఫెడెక్స్ మోసాలు, రెంటల్, ఇన్‌వెస్ట్‌మెంట్, లోన్స్, బెట్టింగ్ యాప్, కస్టమర్ కేర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల బారిన పడినపుడు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్.1930కి.. ఇతర సమస్యలు ఎదురైతే 100కి డయల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ నేరాలపై ప్రధాన కూడళ్లలో, కళాశాలల్లో, జన సమ్మర్ధం ఉన్నచోట వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. మాదాపూర్ డిటెక్టివ్ టీంలో 10 మంది ఉన్నారు. సైబర్ క్రైంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నవారు ఇద్దరున్నారు. నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

ప్రశ్న: మాదాపూర్ ప్రాంతంలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి?

ఇన్‌స్పెక్టర్: సైబర్ నేరాలతో పాటు ఎక్కువగా హాస్టళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. సరైన భద్రత లేకపోవడం వల్ల రూంలలోకి చొరబడి ల్యాప్‌టాప్స్, ఫోన్స్, నగదుతో పాటు ఖరీదైన వస్తువులను దొంగిలిస్తున్నారు. 24 గంటల పాటు సెక్యూరిటీని నియమించాలి. హాస్టల్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి ఐడీ కార్డు ఇవ్వాలి. లోపలికి వెళ్ళేవారు తప్పని సరిగా ఐడీ కార్డులను చూపాలనే నిబంధన ఉండాలి. అప్పుడే దొంగతనాలను అరికట్టవచ్చు.

ప్ర: ఫెడెక్స్ మోసం గురించి?

జ: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీకు ఎయిర్‌పోర్టు నుంచి పార్సిల్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయని.. మీరు ఫలానా పోలీస్‌స్టేషన్‌కు రావాలని భయపెడతారు. కొంత సమయం తరువాత మీరు డబ్బు చెల్లిస్తే కేసు కొట్టివేస్తామని చెప్పి వారివద్ద నుంచి డబ్బు వసూలు చేసి ఫోన్‌లను స్విచ్ఛాఫ్ చేస్తారు. ఇలాంటి మోసాల బారిన విద్యావంతులేపడుతున్నారు. ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలి.

ప్ర: ట్రాన్స్‌జెండర్స్, సోషల్‌మీడియా ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి?

జ: ఖాళీ ప్రదేశాల వద్ద, ప్రధాన కూడళ్లలో ట్రాన్స్‌జెండర్స్ ఎక్కువగా ఇబ్బందులు పెడుతున్నారు. వారి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండాలి. వారి వద్ద ఆగవద్దు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే 100కి డయల్ చేయాలి. అమ్మాయి, అబ్బాయిలు కలిసి ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలు వారు విడిపోయిన తరువాత మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. పర్సనల్ విషయాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

ప్ర: బెట్టింగ్ యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలు ఏమిటి..

జ: ప్రస్తుతం బెట్టింగ్‌కి అలవాటు పడ్డారంటే ప్రాణాలు కోల్పోవాల్సిందే. చిన్న చిన్న బెట్టింగ్‌లు కట్టినప్పుడు తిరిగి డబ్బును చెల్లించి ఆసక్తి కలిగిస్తారు. అలవాటు అయిన తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు పోతాయి. ఇలాంటి అలవాట్లతో బంధువుల వద్ద, స్నేహితుల వద్ద అప్పులు చేస్తుంటారు. నష్టపోయాక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు.

